

పెగడపల్లి : మండలకేంద్రంలో ఓటు వేసేందుకు బారులు తీరిన ఓటర్లు

## గ్రామాల్లో సుంకె రవిశంకర్ ఓటింగ్ సరళి పరిశీలన

కొడిమ్యాల, నవంబర్ 30: మండలంలో 77.11శాతం ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. మండలకేంద్రంతో పాటు డబ్బుతిమ్మాయిపల్లి, హిమ్మత్‌రావుపేట, పూడూర్ గ్రామాల్లో ఎమ్మెల్యే రవిశంకర్ ఓటింగ్ సరళిని పరిశీలించారు. తహశీల్దార్ రవికాంత్, ఎస్ఐ వెంకట్రావ్ బందోబస్తు నిర్వహించారు.



మల్యాల: మల్యాలలో మొదటిసారి ఓటు వేసేందుకు పోలింగ్ కేంద్రానికి వచ్చిన యువతులు

# జిల్లాలో పోలింగ్ ప్రశాంతం

- పలుచోట్ల మొరాయించిన ఈవీఎంలు.. అప్పటికప్పుడు సరిచేసి పోలింగ్ కొనసాగేలా చర్యలు చేపట్టిన ఎన్నికల అధికారులు
- పోలింగ్ కేంద్రాలను సందర్శించిన అభ్యర్థులు

ధర్మపురి, నవంబర్ 30: ధర్మపురి అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. మొదటి రెండు గంటలు ఓటింగ్ కొంత మందకొడిగా సాగింది. ఉదయం 9 గంటల వరకు 8.80 శాతం మాత్రమే పోలింగ్ నమోదైంది. 9 నుంచి ఓటర్లు కేంద్రాలకు భారీగా తరలివచ్చి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. 11 గంటలకు 21.3 శాతం పోలింగ్ నమోదైంది. మధ్యాహ్నం ఒంటి గంట వరకు 45.70, మధ్యాహ్నం 3గంటల వరకు 62.66, సాయంత్రం 5 గంటల వరకు 77.50 శాతం పోలింగ్ నమోదైంది. అయితే తొలిసారి ఓటు హక్కు వచ్చిన యువతీయువకులు ఉత్సాహంగా ఓటువేశారు. ఓటు వేసేందుకు కేంద్రాలకు వచ్చిన వృద్ధులు, దివ్యాంగులకు ట్రై సైకిళ్లు అందుబాటులో ఉంచారు. ఫలితంగా సాయంత్రం 5 గంటల వరకు 77.50 శాతం పోలింగ్ శాతం నమోదైనట్లు ఎన్నికల రిటర్నింగ్ అదికారి దివాకర ప్రకటించారు.

**రాయపట్నంలో ఓటు హక్కును వినియోగించుకున్న ఐఏఎస్ అధికారి**

రాయపట్నం గ్రామానికి చెందిన ఐఏఎస్ అధికారి అయేషా మస్రత్ ఖానం గ్రామంలో గురువారం కుటుంబసభ్యులతో కలిసి ఓటు హక్కును వినియోగించుకున్నారు. అయేషా మస్రత్ ఖానం ప్రస్తుతం రాష్ట్ర పంచాయతీ రాజ్ డిప్యూటీ సెక్రటరీగా విధులు నిర్వహిస్తున్నారు.

**పోలింగ్ సరళిని పరిశీలించిన అభ్యర్థులు**

రాయికల్, నవంబర్ 30: రాయికల్ మండలంలోని పలు గ్రామాల్లోని ఎన్నికల సరళిని జగిత్యాల ఎమ్మెల్యే, బీఆర్ఎస్ అభ్యర్థి డాక్టర్ సంజయ్ కుమార్, కరీంనగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ, కాంగ్రెస్ అభ్యర్థి తాటిపర్తి జీవన్ రెడ్డి, బీజేపీ అభ్యర్థి డాక్టర్ బోగ శ్రావణి పరిశీలించారు. రాయికల్ పట్టణంలోని 12వ పోలింగ్ కేంద్రాల్లో 73.07 శాతం ఓటింగ్ నమోదైంది. పట్టణంలోని 12,848 మంది ఓటర్లుండగా వీరిలో 9,389 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఇందులో 4,235 మంది పురుషులు కాగా 5,154 మంది మహిళలు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. రాయికల్ మండలంలో మొత్తంగా 76.49 ఓటింగ్ నమోదైనట్లు అధికారులు గంగుల సంతోష్ కుమార్, మహ్మద్ అబ్దుల్ ఖయ్యూం తెలిపారు. కాగా రాయికల్, అల్లీపూర్ గ్రామాల్లో సమయం ముగిసిన ఓటర్లు క్యూలో ఉండి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. అలాగే ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్ రాయికల్ పట్టణంలోని పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. వీరివెంట డీఎస్పీ వెంకటస్వామి, ఎస్ఐ అజయ్ పోలింగ్ కేంద్రాలను పర్యవేక్షించారు.

**238వ కేంద్రంలో మొరాయించిన ఈవీఎం**

మెట్‌పల్లి రూరల్, నవంబర్ 30: రాష్ట్ర శాసన సభ ఎన్నికల పోలింగ్ గురువారం ప్రశాంతంగా ముగిసింది. 600 ఓటర్లకో పోలింగ్ కేంద్రాన్ని కేటాయించాల్సి ఉండగా, 1200 ఓటర్లకు కలిపి వెల్లుల్ల జడ్పీహెచ్ఎస్‌లోని 238వ పోలింగ్ కేంద్రాన్ని కేటాయించారు. దీంతో సదరు పోలింగ్ కేంద్రం వద్ద ఉదయం నుంచి సాయంత్రం వరకు ఓటర్లు బారులు తీరారు. ఈ కేంద్రంలో సాయంత్రం ఐదు గంటల వరకు క్యూలైన్లో ఉన్న వారందరికీ ఎన్నికల అధికారులు ఓటు వేసేందుకు అనుమతినిచ్చారు. మెట్‌పల్లి ఎంపీపీ మారు సాయిరెడ్డి వెల్లుల్లలో ఓటు హక్కు వినియోగింకున్నారు. మండలంలో ఏకైక ట్రాన్స్‌జెండర్ అఖిల జగ్గసాగర్‌లో ఓటు వేశారు. కాగా ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు వేంపేటలో, వెల్లుల్ల, జగ్గసాగర్‌లో బీఆర్ ఎస్ అభ్యర్థి సంజయ్ ఓటింగ్ సరళిని పరిశీలించారు.

**మూడుచోట్ల మొరాయించిన ఈవీఎంలు**

మెట్‌పల్లి రూరల్, నవంబర్ 30: రాష్ట్ర శాసన సభ ఎన్నికల సందర్భంగా గురువారం జరిగిన పోలింగ్‌లో మెట్‌పల్లి మండలంలో మూడుచోట్ల ఈవీఎంలు మొరాయించాయి. బండలింగాపూర్ గ్రామంలోని 39వ పోలింగ్ కేంద్రం, కేసీఆర్ తండాలోని 253వ పోలింగ్ కేంద్రాల్లోని ఈవీఎంలు కొద్దిసేపు మొరాయించడంతో, అధికారులు సరిచేశారు. అలాగే మెట్లచిట్టాపూర్‌లోని 244వ కేంద్రంలో వీవీ ప్యాట్ మొరాయించడంతో అధికారులు దాని స్థానంలో కొత్తది అమర్చారు. దీంతో ఆయా కేంద్రాల్లో సుమారు అరగంట పాటు పోలింగ్ నిలిచిపోగా, తదనంతరం అధికారుల చర్యలతో యథావిధిగా కొనసాగింది.

**ఉదయం మందకోడిగా, మధ్యాహ్నం వేగంగా**

ఇబ్రహీంపట్నం, నవంబర్ 30: ఉదయం మందకోడిగా పోలింగ్ జరుగగా మధ్యాహ్నం వరకు పుంజుకుంది. మధ్యాహ్నం నుంచి అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద ఓటు వేసేందుకు పెద్దసంఖ్యలో ఓటర్లు బారులు తీరారు. కాగా డబ్బ గ్రామంలో 32 పోలింగ్ బూత్‌లో ఈవీఎం మొరాయించగా అరగంట పాటు ఆలస్యం కావడంతో అధికారులు మరో ఈవీఎంను ఏర్పాటు చేశారు. పోలింగ్ కేంద్రాల వద్ద పోలీసులు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా పటిష్టమైన బందోబస్తును నిర్వహించారు. కాగా ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకున్నారు.

**మల్లాపూర్‌లో ప్రశాంతంగా పోలింగ్**

మల్లాపూర్, నవంబర్ 30: మండల వ్యాప్తంగా 23 గ్రామాల్లో 50 పోలింగ్ బూత్‌లు ఉండగా, ఇందులో పురుషులు 18,734, మహిళలు 21,115 కలిపి 39849 మంది ఓటర్లు ఉన్నారు. అలాగే ఎన్నికల శాఖ అధికారులు నూతనంగా గొర్రెపల్లిలో గ్రామంలో మోడల్ పోలింగ్ స్టేషన్, ఓబులాపూర్‌లో ప్రత్యేక మహిళా పోలింగ్ స్టేషన్, కొత్త దాంరాజ్‌పల్లిలో ప్రత్యేక యూత్ పోలింగ్‌స్టేషన్లను ఏర్పాటు చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా ఎస్ఐ నవీన్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహిస్తున్నారు. గ్రామాల్లో ఎన్నికల ప్రక్రియను తహసీల్దార్ వీర్ సింగ్, ఎంపీడీవో జగదీశ్ పరిశీలించారు.

**ఓటింగ్ ప్రక్రియ పరిశీలన**

కథలాపూర్, నవంబర్ 30: వేములవాడ నియోజకవర్గంలోని కథలాపూర్ మండలంలోని గురువారం నిర్వహించిన అసెంబ్లీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. ఎలాంటి అవాంఛనీయ సంఘటన జరుగకుండా కథలాపూర్ ఎస్ఐ కిరణ్ కుమార్ ఆధ్వర్యంలో భారీ బందోబస్తు నిర్వహించారు. మండలంలోని గ్రామాల్లో వేములవాడ నియోజకవర్గ కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి ఆది శ్రీనివాస్, బీఆర్ఎస్ అభ్యర్థి చల్మెడ లక్ష్మీనరసింహారావు కూతురు నివేదిత, మాజీ జడ్పీ చైర్‌పర్సన్ తుల ఉమ పర్యటించి ఎన్నికల ప్రక్రియను పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు.

**పోలింగ్ సరళి పరిశీలన**

మల్యాల, నవంబర్ 30: మండలంలోని 53 పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికల ప్రక్రియ సజావుగా సాగింది. బీఆర్ఎస్ అభ్యర్థి సుంకె రవిశంకర్, కాంగ్రెస్ అభ్యర్థి మేడిపల్లి సత్యం, బీజేపీ అభ్యర్థి బొడిగ శోభ పోలింగ్ సరళిని మండలకేంద్రంలోని పలు పోలింగ్ కేంద్రాల్లో పరిశీలించారు. కేటీఆర్ పీఏ బండారు తిరుపతి తమ స్వగ్రామమైన పోతారంలో ఓటు హక్కును వినియోగించుకున్నారు. మండల వ్యాప్తంగా గల పోలింగ్ స్టేషన్ల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా మల్యాల సీఐ బిల్లా కోటేశ్వర్, ఎస్ఐలు తీగల అశోక్, కుమారస్వామి పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయడంతోపాటు ఎప్పటికప్పుడు పోలింగ్ సరళిని సైతం పరిశీలించారు.

**బారులు తీరిన ఓటర్లు**

కోరుట్ల, నవంబర్ 30: పట్టణంలో నిర్వహించిన పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. స్థానికంగా ఏర్పాటు చేసిన 54 పోలింగ్ బూత్‌ల్లో ఓటు వేసేందుకు ఓటర్లు బారులు తీరారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల, బిలాల్‌పురా, ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లు బారులు తీరి కనిపించారు. మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పోలింగ్ సెంటర్‌లో సాంకేతికలోపంతో ఎన్నికల ప్రక్రియకు 45 నిమిషాల పాటు అంతరాయం కలిగింది. స్థానిక వేముల వాడ రోడ్డు సమీపంలో బీఆర్ఎస్, బీజేపీ, కాంగ్రెస్ కార్యకర్తల నినాదాలతో స్వల్ప ఉద్రిక్తత నెలకొంది. అదే సమయంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ స్టేషన్‌ను పరిశీలించేందుకు వచ్చిన ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్ కొద్దిసేపు ఆగి కార్యకర్తలను సముదాయించి అక్కడి నుంచి పంపించి వేశారు. పోటాపోటీ నినాదాలతో అక్కడ గందరగోళ పరిస్థితి నెలకొంది. కటిక వాడలో బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకుల మధ్య తోపులాట జరుగడంతో పోలీసులు ఇరువర్గాలను శాంతింపజేశారు. పట్టణంలోని భీమునిదుబ్బ పోలింగ్ కేంద్రంలో కాంగ్రెస్ అభ్యర్థి జువ్వాడి నర్సింగరావు తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. స్థానిక ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో ఉన్న పోలింగ్ బూత్‌కు బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి ధర్మపురి అర్వింద్ రాగా బీఆర్ఎస్ కార్యకర్తలు పెద్ద ఎత్తున నినాదాలతో నిరసన తెలిపారు. కోరుట్ల బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల పట్టణంలోని పలు పోలింగ్ బూత్‌ల్లో ఓటింగ్ సరళిని పరిశీలించారు. 5 గంటల లోపు వచ్చిన ఓటర్లను పోలింగ్ బూత్‌ల్లోకి అనుమతించిన అధికారులు గేట్లు మూసివేశారు. పలు పోలింగ్ బూత్‌ల్లో రాత్రి 7 వరకు ఓటింగ్ కొనసాగింది. మొత్తంగా పోలింగ్ కేంద్రాల వద్ద జనాల సందడితో పండుగ వాతావరణం నెలకొంది.

**బీఆర్ఎస్ కార్యకర్తల ఆనందహేళ**

కోరుట్లలో బీఆర్ఎస్ అభ్యర్థి డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల విజయం ఖాయమని కార్యకర్తలు సంబురాలు జరుపుకున్నారు. పట్టణంలోని వేములవాడ రోడ్డు నుంచి నంది చౌక్ వరకు పాదయాత్రగా వచ్చి పటాకులు కాల్చి సంతోషం వ్యక్తం చేశారు. కోరుట్ల ప్రజలు బీఆర్ఎస్‌కు మద్దతుగా నిలిచారని ఆనందం వ్యక్తం చేశారు.

**పోలింగ్‌ను పరిశీలించిన కొప్పుల**

వెల్గటూర్, నవంబర్ 30: వెల్గటూర్, ఎండపల్లి మండలాల్లోని 30 గ్రామాల్లో 53 కేంద్రాల్లో పోలింగ్ జరిగింది. మండలం కేంద్రంలో జడ్పీటీసీ బొడ్డు సుధారాణి-రామస్వామి దంపతులు తమ ఓటును వినియోగించుకున్నారు. ఉమ్మడి మండలంలోని పలు గ్రామాల్లో పోలింగ్ స్టేషన్లలో సరళిని బీఆర్ఎస్ అభ్యర్థి, రాష్ట్ర మంత్రి కొప్పుల ఈశ్వర్ పరిశీలించారు. ఈ సందర్భంగా పలు సూచనలు చేశారు.

**పెగడపల్లి మండలంలో**

పెగడపల్లి, నవంబర్ 30: మండలంలోని 23 గ్రామాలకు అధికారులు పోలింగ్‌కు 45 కేంద్రాలు ఏర్పాటు చేశారు. మండలంలో మొత్తం 34,759 ఓటర్లు ఉండగా, ఇందులో 17,845 మహిళా, 16905 పురుష ఓటర్లు ఉన్నారు. పెగడపల్లి మండలకేంద్రంలోని 261వ కేంద్రంలో ఈవీఎం మొరాయించగా, అధికారులు మరో ఈవీఎంను ఏర్పాటు చేయగా, ఇక్కడా పోలింగ్ గంటసేపు ఆలస్యంగా ప్రారంభమైంది. ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తంకుండా ఉండేందుకు ఏర్పాట్లు చేశారు. మండలంలోని ఐదుచోట్ల కొత్తగా ఆదర్శ మహిళా పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసి, వాటిని అందంగా ముస్తాబు చేశారు. మండలంలో అసెంబ్లీ ఎన్నికలు పూర్తి శాంతియుతంగా జరిగాయని, సహకరించిన మండల ప్రజలకు ఎస్ఐ సీ హెచ్ సతీశ్ కృతజ్ఞతలు తెలిపారు.

**మొరాయించిన ఈవీఎంలు**

గొల్లపల్లి, నవంబర్ 30: మండలంలో 28 గ్రామాల్లోని 44 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. 197, 198 పోలింగ్ కేంద్రాల్లో పోలింగ్ ముగిసే సమయం సాయంత్రం 5 గంటల తర్వాత సైతం క్యూలో ఓటర్లు బారులు తీరారు. 198 కేంద్రంలో సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ పూర్తి కాగా, 197లో వందలాదిగా ఓటర్లు బారులు తీరారు. రాత్రి 9 గంటలైన ఓటింగ్ పూర్తయ్యే అవకాశం లేదు. క్యూలో ఉన్నవారికి మాత్రం ఓటువేసే అవకాశాన్ని అధికారులు కల్పించారు. 197 పోలింగ్ కేంద్రంలోని ఎన్నికల సిబ్బందిని జాప్యం వల్లే ఓటింగ్ సరళిలో జాప్యం జరిగింది. ఉదయం నుంచే ఆ కేంద్రంలో ఓటు వేసే వారు గంటల సేపు నిరీక్షించాల్సి వచ్చింది. ఎప్పటికప్పుడు పర్యవేక్షించాల్సిన మండల స్థాయి అధికారులు పట్టించుకోలేదు.



కొడిమ్యాల: ఓటు హక్కు వినియోగించుకున్న యువ ఓటర్లు



కోరుట్ల : ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఓటు వేసేందుకు బారులు తీరిన మహిళలు



గొల్లపల్లి: పోలింగ్ సరళిని పరిశీలించడానికి వచ్చిన కొప్పుల ఈశ్వర్